# 5

# తులసి

తొమ్మిదేళ్ళ ఆదిత్య నాలుగో తరగతి హోం వర్కు రాసుకుంటున్నాడు. సాయంత్రం ఆరైనా ఆదిత్య డాడీ డ్యూటీ నుండి యింకా రాలేదు. మనవడి తదేక దీక్ష చూసి బామ్మ తులసి వాత్సల్యంగా నవ్వింది. ముప్పయేళ్ళక్రితం వీడి డాడీ కూడా యిలాగే యిదే దీక్షతో చదివేవాడని గుర్తు చేసుకుంది.

వాత్సల్యం పొంగుకొచ్చి, పోయిన పెనిమిటి గుర్తొచ్చి కళ్ళుత్తుకుని మనవడికి పాలు వేడిచేసి హార్లిక్సు కలిపి గ్లాసునిండా తెచ్చింది.

"తాగురా ఆదిత్యా! చల్లారి పోతే బాగుండదు" అంటూ తాగించబోయింది తులసి.

"బామ్మా! నీకు బుద్దుందా! నీకు ఎన్నిసార్లు చెప్పాలి. హోంవర్క్ చేసుకునేటప్పుడు నన్ను డిస్టర్బ్ చేయొద్దని" అంటూ విసురుగా నానమ్మ చేతిని తోసేసాడు. పాలు ఒలికి తులసమ్మ చేయి చురుక్కుమంది. మనవడి ఈసడింపుతో మనస్సు కలుక్కుమంది.

"నేను ఏం పాపం చేశాను. నన్ను అందరూ విసుక్కుంటారేమిటి? నాకు చావైనా ఎందుకు రావడం లేదు" అని కళ్ళుత్తుకుంది తులసమ్మ.

హార్లిక్సు కలిపిన పాలగ్లాసును టీపాయ్ మీద ఉంచి ఒలికిన పాలను గుడ్డతో తుడిచి చేయికడుక్కుంది.

కొన్ని అంట్లగిన్నెలుంటే తోమడానికి ముందేసుకుంది. కాలిన చేయి వణికి గంటె జారిపడింది. కంగుమంటూ యితర గిన్నెలపై పడి ఒకటి వెంట ఒకటి దొర్లిపోయాయి.

"నువ్వు ఎప్పుడు చస్తావో కదా! నా గండాన దాపురించావు. రాసుకునే

టప్పుడు డిస్టర్బ్ చెయ్యొద్దు అని చెప్పానా!" అంటూ ఆదిత్య పరిగెత్తుకొచ్చి కాలితో తన్ను తన్నాడు. తులసమ్మ బ్యాలన్సు ఆగక గిన్నెలపై బోర్లాపడి పోయింది.

ఆదిత్య ఆమెను లేపే ప్రయత్నం చేయలేదు.

"వెధవబతుకు వెధవయిల్లు ఇంట్లోనైనా ప్రశాంతంగా ఉండనీయరు" అని గొణుక్కుంటూ కుర్చీలో కూర్చుని టీపాయ్ మీది హార్లిక్సు గ్లాసు తీసుకున్నాడు. రెండు గుక్కలు తాగాడు ఆదిత్య.

"బామ్మా! నిన్నెవరు హార్లిక్సు కలపమన్నారు. అసలిందులో షుగర్ కలిపావా? నీ మతిమరుపు మండా" అంటూ గ్లాసు ఎత్తేశాడు. గదంతా ఒలికిపోయాయి పాలు.

ట్యూషన్ కెళ్ళి మిగతా పిల్లలు రాలేదు.

తులసమ్మ బట్టపీలికతో తుడిచి నీళ్ళతో మళ్ళీ తుడిచి శుభ్రం చేసింది.

మనవడిని ఒక్క మాటనలేకపోయింది. ఏమైనా అంటే జరిగే పర్యవసాన మేమిటో ఆమెకు తెల్సు. ఇల్లంతా చిందర వందర అవుతుంది. మమ్మీ డాడీలకు ఏవేవో కల్పించి చెప్పి మరో నాలుగు మాటలు తిట్టిస్తాడు.

❄ ❄ ❄

కొడుకూ కోడలూ డ్యూటీనుంచి వచ్చి స్నానం చేసి ఫ్రెష్ అయ్యేసరికి వేడి వేడి టీ అందించింది తులసమ్మ.

మందులు వేసుకున్నావా అనిగాని నువ్వు టీ తీసుకోలేదేంటి అనిగాని అడక్కపోవడంతో తులసమ్మ అభిమానం దెబ్బతింది.

"ఉత్తమ్, వాడి భార్య ఉజ్వల మధ్యాహ్నం వచ్చార్రా! లీనా పెళ్ళికి వారం రోజులు ముందే రావాలి పిన్నీ అని ఒకటే పోరు" అంది తులసి.

"వదినా అన్నయ్యలకు నిజంగానే ప్రేమ ఉండి కాదు నిన్ను పిలుస్తున్నది. పెళ్ళికి ముందు వారం, పెళ్ళయ్యాక వారం వెట్టిచాకిరీ చేయించుకోవచ్చు గదా అని ప్రేమ ఒలకబోసి ఉంటారు." అని కొడుకు ఆనంద్ కయ్యిమన్నాడు.

"ఇక్కడ మాత్రం ఉండి చేసేదేముంది" అంది తులసమ్మ.

"సూటిగానే అనరాదూ, ఇంట్లో కొడుకు దగ్గర ఉండి ఏదో చిల్లర పని చూసుకుంటే నీకిది వెట్టిచాకిరి అయిపోయింది. అమ్మా! నీవెప్పుడూ యింతే. నిన్ను ఎంతబాగా చూసుకున్నా అందరిలో పరువు తీస్తుంటావు. నీకెప్పుడు తమ్ముడంటేనే ప్రేమ"

"నాకీ యింట్లో ఏపాటి మర్యాద. మన్నన ఉందో మీకు తెల్సు, నాకు తెల్సు. నేను ఎవరికీ చెప్పి మీ పరువు తీయడం లేదు. ఎందుకు నన్ను మాటలంటారు."

కోడలు సౌమ్య కలుగజేసుకొంది.

"అత్తమ్మా! ఎందుకు అబద్ధాలాడతారు. మీ చిన్న కొడుకు పదివేలు అప్పు అడిగితే యివ్వలేదని ప్రశాంత్ అన్నయ్యకెలా తెలిసింది. ప్రశాంత్ అన్నయ్య ఈ పాటికే ఊరంతా చాటించేశాడు. ఎందుకిట్లా పరువు తీస్తావు? మమ్మల్ని బతకమంటావా చావమంటావా? మా ఇబ్బందులు మాకున్నాయి. ఇంట్లో డబ్బులుంటే అవన్నీ మిగులేనా? ఎన్ని అప్పులు కట్టాలి?"

"సౌమ్యా! మీరిద్దరు కల్సి ఓ రాత్రి గొంతు పిసికి చంపేయండి కానీ యిలా నిందలు వేయకండి. ప్రశాంత్‌కు చిన్నాడే చెప్పి ఉంటాడు. ప్రశాంత్ అప్పడిగితే మీ అన్నయ్య నడగరాదు అని అంటే అన్నయ్య లేవన్నాడని చెప్పి ఉంటాడని ఎందుకనుకోరూ!"

"అత్తమ్మా! నీ స్వభావం స్పష్టం చేసుకున్నావు. చిన్న కొడుకును సమర్థించ డానికి ఎన్ని కథలల్లుతుందో చూడండీ!" అంటూ భర్తకేసి చూసింది సౌమ్య.

"ఈ కొట్లాటలు, నిందలు ఎందుకూ? ఓ పదిహేను రోజులు ఉత్తమ్ గాడింటికి వెళ్తానంటే వెళ్ళనీయరేం."

"అత్తమ్మా! నీ బెదిరింపు నాకు తెల్సు. ఇద్దరం ఉద్యోగస్థులం. నేను లేకపోతే ఎట్లా వెళ్ళదీసుకుంటారో అని బెదిరించడం కాక మరేమిటి?"

అంతలో ట్యూషన్ వెళ్ళిన పిల్లలు ఇల్లు చేరారు. "బామ్మా ఏదైనా టిఫిన్ చేసిపెట్టు అంటూ ఆర్డరేసాడు పెద్దమనవడు పవన్.

తులసమ్మ అక్కన్నించి లేచింది.

మరుసటిరోజు ఉదయం పిల్లలు బడికి వెళ్ళాక కొడుకూ కోడలూ డ్యూటికెళ్ళాక తన చీరలు సర్దుకొని ఓ పాలిథిన్ సంచిలో వేసుకొని పక్కింట్లో తాళం చెవి యిచ్చి బస్టాండుకు నడిచింది తులసమ్మ.

అనుకున్న దానికన్నా రెండు రోజుల ముందే వచ్చిన పిన్నమ్మను చూసి ఉత్తమ్, ఉజ్వల ఎంతో సంతోషించారు.

❄ ❄ ❄

"ఏమండీ! అత్తమ్మ వెళ్ళి యిరవైరోజులైంది. పిల్లలు ఆటలకు, టీవీకి ఎగబడ్డారు. ఎవరూ హోం వర్కు సరిగ్గా చేయట్లేదు. ఇంట్లో ఉండకుండా వీధి పోరగాళ్ళతో స్నేహాలెక్కువయ్యాయి. పరీక్షలు దగ్గరకొస్తున్నాయి" అంటూ అంట్లు తోమి అలసటగా అంది సౌమ్య.

"అమ్మ ఇంట్లో ఉన్నంతసేపు అరిచి అరిచి మనిషిని కుంగదీస్తావు. ఇప్పుడేమో యిలా అంటావు" అని విసుక్కున్నాడు ఆనంద్.

"అత్తమ్మను ప్రతిదానికి విసుక్కుని తిట్టేది మీరు. నన్నంటారేంటి?" పోట్లాటకు దిగింది సౌమ్య.

నువ్వనేమాటల వల్లే పిల్లలకు, నానమ్మ అలుసై పోయిందని నువ్వ అనే మాటలే పిల్లలు నేర్చుకుంటున్నారని పరస్పరం వాదులాడుకున్నారు.

"హలో వదినా! అమ్మను రెడీగా ఉండమనండి. రేప్పొద్దున్నే వస్తున్నాను" అన్నాడు ఆనంద్ ఫోన్లో.

"ఏంటి అత్తమ్మ ఇంటికి రాలేదా? బయల్దేరి మూడురోజులైంది"

కంగారు పడిపోయాడు ఆనంద్. ఇంట్లో జరిగిన పోట్లాట తెలియకుండా క్షణంలో మాట సవరించేశాడు.

"అయితే అమ్మ తమ్ముడి దగ్గరికి వెళ్ళుంటుంది. పదిరోజులు వెళ్ళివస్తానని అందిగానీ నేను యిక్కడికే రమ్మన్నాను. ఉంటా వదినా" అంటూ ఫోన్ పెట్టేశాడు ఆనంద్.

అమ్మ అక్కడ లేదని తెల్సి కంగారుతో చెమటలు పట్టాయి. అమ్మ తమ్ముడి ఇంటికి వెళ్ళి ఉండదు. ఎక్కడికి వెళ్ళివుంటుంది. అని ఆందోళన పడిపోయాడు ఆనంద్.

"అత్తమ్మ మనని అందర్లో అప్రదిష్టపాలు చేయాలని కాకపోతే యిదంతా ఏమిటండీ? కనీసం ఫోన్ చేసి ఎటు వెళ్తున్నానో చెప్పి వెళ్ళవచ్చుగా" సౌమ్య కోపంగా అరిచింది.

"బామ్మకు అస్సలు బుద్ధిలేదు. నాకు పొద్దున్నే టిఫిన్ ఎవరు తినిపిస్తారు. బూట్లు ఎవరు తుడుస్తారు. సాయంత్రం హార్లిక్సు ఎవరిస్తారు. ఈసారి వచ్చాక బామ్మని తంతాను. మళ్ళీ ఎక్కడికీ వెళ్ళకుండా" అమ్మ స్థాయిలోనే అరిచాడు ఆదిత్య.

"ఏంట్రా గాడిదా! బామ్మంటే ఎవరనుకున్నావు. ఈ మమ్మీ నీకు ఎట్లా అమ్మో, ఆ బామ్మ అట్లా నాకు మమ్మీ. కాస్త మర్యాదగా మాట్లాడ్డం నేర్చుకో" అన్నాడు ఆనంద్ గద్దిస్తూ.

"ఏంటిది డాడీ మర్యాద! బామ్మకి పొగరెక్కువై వెళ్ళింది అని మమ్మీయే కదా అంది" అంటూ డాడీ లేనప్పుడు మమ్మీ తిట్టిన తిట్లన్నీ బట్టీపట్టినట్లు అప్పగించాడు ఆదిత్య.

"వెధవా! ఇపుడు డాడీకీ నాకు పోట్లాట పెట్టించాలనా? ఎన్ని అబద్ధాలురా" అంటూ నాలుగు అంటించింది సౌమ్య.

ఆదిత్య ఏడుస్తూ నువ్వే అబద్ధాలకోరువి. డాడీ వున్నపుడొకలా మాట్లాడ్తావు, డాడీ లేనప్పుడొకలా మాట్లాడ్తావు. అంటూ ఎదురు తిరిగి డాడీ చంకలో చేరాడు ఆదిత్య.

❄ ❄ ❄

చిన్న కొడుకు అవినాశ్ ఇంటికి వెళ్ళి పదిరోజులు కాలేదు. చిన్న కోడలు అత్తమ్మ ఎలా అయితే వెళ్ళిపోతుంది. అని తిట్టే ఛాన్సు కోసం చూస్తోందని తులసమ్మకు వచ్చిన మూడేరోజే అర్థమైపోయింది. మనవల్ని చూడక చాలా రోజులైందని వస్తే తగిన శాస్తే జరిగిందని తనని తాను తిట్టుకుంది తులసమ్మ.

"ఇదిగో అత్తమ్మా! పిల్లలకు నువ్వు హార్లిక్సనీ, ఉప్మా అని, ఫ్రైకూరలనీ, గడ్డపెరుగనీ ఇల్లుగుల్ల చేస్తున్నావు. నెలరోజుల కోసం తెచ్చిన సరుకులు పదిరోజులకే అయిపోయాయి. ఇక్కడ ఉండాలనుకుంటే పెట్టింది తిను. ఆ మూలకు పడుకో, అంతేగానీ నీ పెద్దకొడుకింట్లో చేసిన వంటలన్నీ యిక్కడ చేయకు. అసలు నువ్వు పొయ్యి వద్దకు రాకు." అని కయ్యిమని లేచింది చిన్న కోడలు ఊర్మిళ.

"నేనేం ఇల్లుగుల్ల చేశానే! నువ్వు ఉప్మా చేస్తే బాగుంటుందే అమ్మా అని నీ మొగుడు అడిగితే చేశాను, నీ కొడుకు నువ్వు చేసే అట్లు, చట్నీ బాగుంటాయి చెయ్యి బామ్మా అంటే చేశాను నేనేం తిన్నానని. నాకు ఏది తిన్నా అరగడమే లేదు."

అవినాశ్ కలగజేసుకొని అన్నాడు.

"అమ్మా! నీకు మందులు కొనివ్వలేదని డైరెక్టుగా తిట్టు, మూస మార్గంలో ఎందుకంటావు. నీ పెద్దకొడుకును బాగా చదివించావు. నాకేం పెట్టావు? అంత సుఖంగా ఉంటే ఆ కొడుకు దగ్గరే ఉండు లేని వాళ్ళ యింటికొచ్చి అరిచి, ఏడ్చి యిరుగుపొరుగులో మా పరువు తీయకు."

"నేనేం పరువు తీసాన్రా? అన్నం అరగడం లేదనడం కూడా తప్పేనా! వాన్ని నీ కొడుకు నీ కొడుకు అంటావు. వాడు నీకు అన్నయ్య కాదా! కాదనుకుంటే అప్పుకోసమైనా వాన్ని ఎందుకు అన్నయ్యా అంటూ అడగడానికి వచ్చావు."

కోడలు ఊర్మిల కొంగు బొడ్లో దోపి యుద్ధానికి రెడీ అయింది. లెక్కలన్నీ తవ్విపోసింది. తాన అంటే తందాన అంటూ వంత పాడాడు అవినాశ్.

"అనండిరా అనండి. ఉన్నదంతా అమ్మి వాడికే పెట్టానని అనండి, నువ్వూ యింటర్ ఫేల్ కాకుండా చదువుకొని ఉంటే నీకూ అప్పోసొప్పో చేసి పెట్టేవాల్లం కాదా! మీ చదువులకు అంతా ఖర్చయిపోయింది. మెడ మీద గుండ్లతో సహా ధారపోసాను. ఇపుడు నా దగ్గర ఆస్తి ఏమి లేక మీ అందరికీ చులకనై పోయాను" అంటూ ఏడ్చింది తులసమ్మ.

"బామ్మా! నువ్వు వచ్చినపుడల్లా పోట్లాటే, అసలు మా యింటికి ఎవరు

రమ్మన్నారు నిన్ను" అంటూ ఊర్మిళ పెద్దకొడుకు అతుల్ బామ్మ పైకి క్రికెట్ బ్యాట్ ఎత్తాడు.

తులసమ్మ హృదయం కలుక్కుమంది, శరీరంలోని రక్తమంతా తోడేసి నట్టుగా నీరసపడిపోయింది. తల్లిదండ్రులన్న మాటలే పిల్లలూ నేర్చుకుంటు న్నారు. ఎంత పెద్దమాటలంటున్నారు. ఈ రోజు ఒక్కపొద్దు అని అన్నం కూడా యింకా తినలేదు. కొంగుతో కళ్ళొత్తుకుంది తులసమ్మ.

తులసమ్మ తన బట్టల్ని పాలిథిన్ సంచిలో సర్దుకుంది. ఎక్కడికి అంటూ గద్దరించాడు అవినాశ్. చేతిలోని సంచీని లాక్కున్నాడు. గట్టిగా లాగడంతో సంచీ చిరిగిపోయింది.

కొడుకులకు కోడళ్ళకు వేల ఖరీదైన సూట్‌కేసులు. తనకు పాలిథిన్ ప్లాస్టిక్ సంచే గతి, అదీ యిపుడు చిరిగిపోయింది.

మనస్సులోని దుఃఖం గడ్డకట్టుకు పోయి తులసమ్మకు మాట పెగలలేదు. కాసేపాగి ఏదో పని ఉన్నదాన్లా బయటకు నడిచి బస్టాండు చేరింది.

పొద్దున్నుంచీ ఏమీ తినకపోవడం వల్ల కాళ్ళు వణుకుతున్నాయి.

కళ్ళు తిరుగుతున్నాయి. అందరూ ఉండి జీవితంలో తానెంత ఒంటరిదై పోయింది. వెక్కివెక్కి ఏడ్చింది.

ఎవరో ఫలానా వాళ్ళ అత్త అనీ, తల్లీ అని పోల్చుకుని బస్టాండు నుండి ఎవరు వెళ్ళి చెప్పారో, ఓ పాత సంచిలో బట్టలు వేసికొని తెచ్చి బామ్మకిచ్చేసి బిర్రుగా చూస్తూ వెళ్ళిపోయాడు అతుల్.

❄ ❄ ❄

తులసమ్మ మళ్ళీ ఆనంద్ ఇంటికి వచ్చి వారం రోజులు కాలేదు.

"నేను బెండకాయ ఫ్రై చేసి ముద్దపప్పు వండి చారు చేయమంటే బెండకాయ పులుసు చేశావేంటి" సౌమ్య తులసి మీదికి గయ్యిమని లేచింది.

"ఆదిత్య బెండకాయ పులుసు పెట్టు బామ్మా! అంటేనూ!"

"వాడికేం తెల్సు నా బొంద." అంటూ దండకం వల్లించింది సౌమ్య.

"అమ్మా! ఈ పుస్తకాలన్నీ ఎందుకు సర్దావు? నేను చెప్పేదాకా ఈ టేబుల్ మీది కాగితాలు, పుస్తకాలు ముట్టద్దని ఎన్నిసార్లు చెప్పాను. రెండు ముఖ్యమైన కాగితాలు కన్పించట్లేదు ఊడ్చిపెంటలో పడేయలేదు గదా!" అన్నాడు కొడుకు కోపంగా.

"అన్నీ అక్కడే పెట్టాను, నేను ఏ కాగితమూ తీయలేదు. ఆ పుస్తకాల్లో ఉంటుంది. ఎక్కడో పెట్టుకొని ఎక్కన్నో వెతుకుతారు". అంది తులసమ్మ. తాను సర్దిన పుస్తకాలను కొడుకు ముందుంచింది.

"ఇదిగో! మధ్యాహ్నం ఈ ఉత్తరం వచ్చింది. చెప్పడం మర్చేపోయాను." అంటూ పుస్తకాలపైనున్న ఉత్తరం కొడుకు చేతికిచ్చింది తులసమ్మ.

కవర్ చింపి చదివాడు ఆనంద్.

అది అమ్మకు రాసిన ఉత్తరం. ఇవ్వడమా! మానడమా! అని క్షణం ఆలోచించాడు.

ఇవ్వకపోతే తర్వాతైనా తెల్సి పెద్ద గొడవవుతుందని...

"అమ్మా యిది నీకే వచ్చింది జయ రాసింది" అంటూ చేతికిచ్చాడు ఆనంద్.

"నువ్వే చదువు. అద్దాలు పెట్టుకున్నా కళ్ళు సరిగ్గా కనపడట్లేదు." అంది తులసి. అప్పుడు గుర్తొచ్చింది ఆనంద్‌కు. అద్దాలు మార్చాలన్న విషయం. ఏడాదిగా అశ్రద్ధవుతోందనుకున్నాడు ఆనంద్. ఉత్తరం తీసి చదివి వినిపించాడు.

అది జయ రాసిన ఉత్తరం. తనకు త్వరలో తొమ్మిదో నెల పడుతుందని, ఒంట్లో బాగుండడం లేదని, నాకంటూ పెద్దతోడు మీరు తప్ప ఎవరూ లేరని ఎలాగైనా మూడు నెలలు అక్కడే ఉండేట్టుగా అన్నీ సర్దుకొని వెంటనే బయల్దేరి రమ్మని మరి మరి కన్నీళ్ళతో ప్రార్థిస్తూ అని రాసిందా ఉత్తరం.

ఉత్తరం పూర్తవగానే కన్నీళ్ళు పెట్టుకుంది తులసమ్మ. తన చెల్లెలు వర్ధని అర్ధంతరంగా ఈ లోకం నించి తప్పుకొంది. జయ ఒంటరిదైపోయింది. దానికి తాను తప్ప ఎవరున్నారు. తల్లి భావాలను చదివేసిన ఆనంద్...

"అమ్మా! అంత తొందరేం లేదు. పొద్దులు నిండాక వెళ్ళి ప్రసూతి అయ్యాక పదిరోజుల్లో మళ్ళీ వచ్చేద్దువుగానీ" అన్నాడు.

"ఇక్కడ ఉండి మాత్రం చేసేదేం ఉందిరా! దానికి మాత్రం తోడెవరున్నారు. అల్లుడిది టూర్ చేసే ఉద్యోగం. ఎప్పుడూ యింటిపట్టున ఉండడు" అంది తులసమ్మ.

జయ దగ్గరకు వెల్దామని ఉదయమే బస్టాండుకు బయల్దేరింది తులసమ్మ.

❄ ❄ ❄

తల్లి పోయిన్నించి తనని పెద్దమ్మా అని పిలిచేబదులు అమ్మా అని జయ పిలుస్తుంటే తులసమ్మకు కన్నకూతురు పిలుస్తున్నంత ఆనందంగా ఉంటుంది.

తులసమ్మకు జయ చేసే సపర్యలు చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. కాస్త మర్యాద, మన్నన, ఒక మంచి మాట ఒక చిన్న ప్రశంసతో ఎండమావిలా మారిన తులసమ్మ జీవితం కొత్త చిగురువేసింది.

తులసమ్మ ఆరోగ్యానికి జయ ఆప్యాయతే మందుగా పనిచేసింది.

"అమ్మా! నువ్వీ టాబ్లెట్ వేసుకో" అంటూ తెచ్చిస్తుంది జయ.

"అమ్మా! అలా కాసేపు ఒరుగు. మధ్యాహ్నం నిద్ర పెద్దవాళ్ళకు చాలా మంచిది. నిద్ర రాకపోయినా ఎంతో అలసట తగ్గుతుంది."

"జయా! ఏంటే నువ్వు వంట చేయడం! నన్నెందుకు పిలిపించినట్టు?"

"జయా! నాకీ వయస్సులో యింత ఖరీదైన చీర ఎందుకే! ప్రసూతి అయ్యాక కొంటే సరిపోయేదిగా."

"మామ్మా! నువ్వొచ్చాక మమ్మీ ఎంత సంతోషంగా ఉందో తెల్సా! నువ్వు ఎప్పటికీ యిక్కడే ఉండాలి. బోలెడు కథలు చెప్తుంది మామ్మ. మామ్మ చాలా మంచిది కదూ" అంటూ నాలుగేళ్ళ నితిన్ గారాలు పోయాడు.

తొలికాన్పు అప్పుడు ఎంత కష్టమైందో జయకు గుర్తొచ్చింది.

పెద్దమ్మ చెయ్యి ఫ్యాక్చరై రాలేకపోయింది.

ఆడపడుచులెవరూ తోడుండడానికి రాలేకపోయారు.

అత్తమ్మ కాలం చేశారు. విరించి ఒక్కడే తోడు, నెల రోజులు లీవు పెట్టి హాస్పిటల్ వెంట తిరిగాడు.

ఇద్దరికీ కొత్త, లీవులు పోయినప్పటికీ డబ్బులు ఖర్చయినప్పటికీ హాస్పిటల్లో ఆదరణ దొరికినప్పటికీ ఆత్మీయులెవరూ లేరని ఏడ్చేసింది. విపంచి అన్నీ తానై ఓదార్చాడు. ఇంట్లో పెద్దవాళ్ళెవరూ లేకపోతే అన్నీ ఉండి అయిదోతనం లేనంత లోటు. ఇప్పుడు పెద్దమ్మ రాకతో యిల్లంతా ఎంత కళకళలాడుతోంది.

"ఏంటే జయా ఆలోచిస్తున్నావు. ఏం బెంగపెట్టుకోవద్దు. ఇప్పుడు యింత మంది డాక్టర్లున్నారు గానీ మాకాలంలో ఎవరున్నారే. మంగలి పోసాని అనే మంత్రసాని నాకు కాన్పులు చేసింది" అంది తులసమ్మ.

"నువ్వుండగా నాకేం బెంగమ్మా" అంది ఆప్యాయంగా జయ.

❄ ❄ ❄

సుఖప్రసవమై కోరుకున్నట్టుగా జయకు కూతురు పుట్టింది. ఆమె ఆనందానికి అవధులు లేవు. అందర్నీ నామకరణోత్సవానికి మరీ మరీ పిల్చింది.

నామకరణోత్సవానికి వచ్చిన ఆనంద్, సౌమ్య - అమ్మను చూసి ఆశ్చర్యపోయారు. అమ్మ మొహంలో ఎంత కళ. పట్టుచీరలో ఉలన్‌షాలువా కప్పుకున్న అమ్మ ఒకానొక తృప్తి తాలూకు తేజస్సుతో రాజమాతలా గోచరించింది. శరీరం ముడుతలు తగ్గి నునుపు తేలింది. కళ్ళకింది నలుపు తగ్గి కళ్ళు కాంతివంతమయ్యాయి.

తన బామ్మతో నితిన్ పోతున్న గారాలు చూసి బామ్మకిస్తున్న గౌరవం చూసి ఆదిత్యకు వాన్ని తన్నాలనిపించింది. గిల్లిగజ్జా పెట్టుకొని నాలుగంటిం చాడు. వద్దని వారించబోయిన తులసమ్మను ఒక్కటిచ్చుకున్నాడు. ఫంక్షన్ కొచ్చి యింకా అక్కడే ఉండిపోయిన దగ్గరి మిత్రులు ఆదిత్యను మందలించారు. ఆ కోపంతో యిల్లంతా చిందరవందర చేశాడు ఆదిత్య. నాలుగంటించింది సౌమ్య.

❄ ❄ ❄

నాలుగు నెలల తర్వాత తీసుకుపోవడానికి వచ్చిన ఆనంద్‌ను చూడ్డంతో ఒక కమ్మని కల కరిగిపోయినట్టు నీరసపడిపోయింది తులసమ్మ. ఆకళ్ళలోని వెలుగు కరిగిపోయింది.

"అన్నయ్యా! అమ్మ వచ్చాక ఈ యిల్లే మారిపోయింది. అమ్మ తర్వాత నాకు మాత్రం అమ్మకాదూ. ఇక్కడే వుండనీ, మా ఆయన కూడా నాదెలాగూ టూర్ జాబ్ కదా! అత్తమ్మ యిక్కడే వుండనీ నీకు తోడుగా ఉంటుంది అన్నాడు" అంది జయ.

"అంకుల్! మామ్మ ఇక్కడే వుండాలి అక్కడైతే ఆదిత్య బావ మామ్మని కొడ్తాడు ఆ రోజెలా చేశాడో చూశారుగా."

ఆనంద్‌కు తలతీసేసినట్టనిపించింది. అంత చిన్న పిల్లాడు. ఆ మాటనడంతో ఆనంద్ లేని ప్రేమను తెచ్చుకొని ఎన్నో మాటలు చెప్పాడు. సౌమ్యకు ఆరోగ్యం బాగుండట్లేదు అన్నాడు అవన్నీ అబద్ధాలని తులసమ్మకు తెలుసు. ఆనంద్ మళ్ళీ మళ్ళీ బతిమాలేసరికి జయ అలిగింది.

"ఎంతైనా సొంత కూతుర్ని కాదుగా! అడగడానికి నాకు హక్కు ఎలా ఉంటుంది?" అని కన్నీరు పెట్టుకుని బేలగా అంది జయ.

జయ ఆ మధ్యే కొనిచ్చిన చిన్న అందమైన సూటుకేసు నిండా తన బట్టలు సర్దుకొంది తులసమ్మ. చిల్లరకంటూ బలవంతంగా యిచ్చిన పెద్దమొత్తాన్ని కొడుక్కు కనపడకుండా సూటుకేసులో సర్దిపెట్టింది.

జయ తులసమ్మ కాళ్ళకు వంగి నమస్కరించింది.

తల్లిని చూసి నితిన్ కూడా మామ్మ కాళ్ళకు బోర్లాపడి రెండు చేతుల్తో నమస్కరించాడు.

అమ్మ పట్ల ఆదిత్య ప్రవర్తన గుర్తొచ్చి ఆనంద్ నితిన్‌తో పోల్చుకుని కంగుతిన్నాడు.

"నిన్ను మళ్ళీ చూస్తానో లేదో జయా" అంది బెంగతో తులసమ్మ.

బస్సు బయల్దేరింది.

తులసమ్మకు గతమంతా గుర్తొస్తోంది.

తన పిల్లలే సర్వస్వం అని జీవితాన్ని వాళ్లకోసం దారపోస్తే తనకు చివరి గడియల్లో ఎలాంటి జీవితం ఎదురవుతోంది. తన బతుకు ఎంత హీనంగా మారిపోయింది. ఆయన పోయాక తన బతుకు ఎలా అయిపోయింది... తాను అందరికీ కావాలి. కానీ తనగురించి ఆలోచించేవారెవరూ లేరు. ఉన్న ఒక్క జయ నుండి దూరం చేస్తున్నారు.

తులసమ్మ కాళ్ళు చేతులు వణికాయి.

స్వర్గం నుండి యమదూత నరకానికి తీసుకుపోతున్నట్టనిపించింది.

గుండె దడ హెచ్చింది.

మొహం పాలిపోయింది.

కళ్ళు చీకట్లు కమ్మాయి.

కొడుకు భుజంపై తలవాల్చేసింది తులసమ్మ.

"అమ్మా!" అంటూ ఒక్కసారిగా అరిచాడు ఆనంద్.

**ఆదివారం ఈనాడు దిన పత్రిక, 30-5-1999**

❄ ❄ ❄